ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 11 ఏప్రిల్ 2024



సమన్వయమే సవాల్!

- కాంగ్రెస్‌లో కడియంతో కలిసిరాని ఆశావహులు, దిగువ కేడర్
- కడియం కావ్య.. తమ అవకాశాలకు గండి కొట్టారని నిర్వేదం
- శ్రీహరిపై 'గులాబీ ఫండ్' మరకలు
- రేవూరికి పార్లమెంటు బాధ్యతలపై పాత నేతల కినుక
- కొండా, నాయినిలను విస్మరించారని అనుచరుల అలక
- సీఎం రేవంత్‌రెడ్డి బుజ్జగించినా తగ్గని అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని' చందంగా మారింది కడియం శ్రీహరి కాంగ్రెస్ రాజకీయ ప్రయాణం. కాంగ్రెస్ అధిష్ఠానం ఫుల్‌సపోర్టు చేస్తూ ఆయన కూతురికి వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చింది. కానీ, ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. ఆమె రాకతో తమ అవకాశాలకు గండిపడిందని పలువురు ఆశావహులు తీవ్ర నిర్వేదంలో ఉన్నారు. అంతేకాదు ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రె‌స్‌కు పెద్ద దిక్కుగా ఉంటున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కాదని, ఎన్నికల ముందు పార్టీలో చేరిన పరకాల ఎమ్మెల్యేకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంపై కూడా కేడర్ నారాజ్ అవుతోంది. మరోవైపు బీఆర్‌ఎస్ నుంచి ఫండ్ తీసుకుని కాంగ్రె‌స్‌లోకి జంప్ అయ్యారనే ఆరోపణలు కూడా కడియం శ్రీహరికి మచ్చలా మారుతున్నాయి. అయితే ఈ పరిణామాలను గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కడియంతో సయోధ్య కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదన్న చర్చ జరుగుతోంది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ అధిష్ఠానానికి సమన్వయం ఓ సవాల్‌గా మారనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కావ్యతో కలవని కేడర్

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో చాలా మంది కాంగ్రెస్ కోసం అనేక త్యాగాలు చేసిన వారు, పార్టీకి వీరవిధేయులు ఉన్నారు. కొందరైతే ఏకంగా తమ ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వదులుకుని.. కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రధానంగా సీనియర్ నేతలు దొమ్మాటి సాంబయ్య, శనిగపురం ఇందిరలలో ఒకరికి టికెట్ దాదాపు ఖాయమనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య తన తండ్రి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రె‌స్‌లో చేరటమే కాకుండా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జాక్‌పాట్ కొట్టేశారు. దీంతో కాంగ్రెస్ టికెట్‌పై ఆశలతో ఉన్న నేతలు, వారి అనుచర వర్గంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారని కేడర్ మదనపడుతోంది. ఆయా ఏరియాల్లోని కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో కడియం ఎపిసోడ్‌పై నిరసనలు వైరల్ అవుతున్నాయి. కనీసం టికెట్ ఆశించిన ముఖ్య నేతలతో చర్చించకుండా ఏకపక్షంగా కావ్య పేరు ఖరారు చేయటంతో తామెందుకు సహకరించాలనే తిరుగుబాటు ధోరణి అటు నేతల్లోనూ, ఇటు కార్యకర్తల్లోనూ కనిపిస్తోంది. పేరుకు అభ్యర్థి కావ్య అయినప్పటికి బాధ్యతలు మొత్తం కడియం శ్రీహరి తన భుజస్కంధాలపై వేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరి ఇళ్లకు వెళ్లి తన కూతురును ఆశీర్వదించాలని కోరుతున్నారు. కొందరు మొహమాటానికి సరే అని చెప్పిన, వెనుక మాత్రం ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కావ్యకు కొందరు ఎమ్మెల్యేలతో పాటు కేడర్ నుంచి పూర్తిస్థాయి సహకారం అనుమానమేనన్న ప్రచారం జరుగుతోంది.



ఇటీవలి ఉమ్మడి జిల్లా సమీక్షలో సీఎంతో నేతలు

కడియం శ్రీహరిపై బీఆర్‌ఎస్ ఫండ్ ఆరోపణలు

తొలుత బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును మార్చి 13న ఆ పార్టీ అధినేత ప్రకటించారు. దీంతో కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించటమే కాకుండా ప్రచారానికి కావాల్సిన ఏర్పాట్లను కూడా చేసుకున్నారు. ఈ క్రమంలోనే పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలకు కావాల్సినంతా డబ్బులను ఫండ్ రూపంలో శ్రీహరికి అప్పగించిందనే ప్రచారం జరుగుతోంది. అయితే గులాబీ ఫండ్ చేతికి వచ్చిన తరువాతే కారు దిగు కాంగ్రె‌స్‌లో చేరారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సరపడా ఫండ్ అంటే భారీ మొత్తంలోనే

▸▸ మిగతా 7వ పేజీలో..

సమన్వయం సాధ్యమేనా..?


లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రె‌స్‌లో సమన్వయం ఓ సవాల్‌గా మారింది. కడియం కావ్య అభ్యర్థిత్వంపై కేడర్‌తో పాటు కొందరు ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి కడియం శ్రీహరి సూచన మేరకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు, ముగ్గురు టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు కూడా హాజరయ్యారు. కావ్యను గెలిపించాలని సీఎం చెప్పిన మాటలకు సరేనన్న నేతలు బయటకు వచ్చిన తర్వాత గెలుపు బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకునేందుకు ముందుకు రావటం లేదన్న చర్చ జరుగుతోంది. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవటంతో కేడర్‌ను, లీడర్‌ను సమన్వయం చేసేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి శనిగపురం ఇందిరా ఇప్పటికే కడియంకు సహకరించేది లేదం టూ ప్రకటనలు ఇస్తున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి కొండా సురేఖ మెదక్ ఎంపీ స్థానంపై దృష్టిపెట్టి అటు వైపే ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో కడియం సహకారం అంతంతే అనే చర్చ జరుగుతోంది. ఇక పాతికేళ్లకు పైగా రాజకీయాల్లో చక్రం తిప్పిన శ్రీహరి తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం... తనపై పడిన గులాబీ ఫండ్ మరకను చెరుపుకోవడంతో పాటు సొంత పార్టీలో అసంతృప్తులను సమన్వయం చేసుకోవడంలో ఏ మేరకు విజయవంతమవుతారన్న చర్చ జరుగుతోంది.



నేడు ఈద్ ఉల్ ఫిత్ర్

- ▸▸ నెలవంక దర్శనంతో రంజాన్ సందడి
- ▸▸ నమాజ్ కోసం ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- ▸▸ ముగిసిన 30రోజుల కఠిన ఉపవాస దీక్షలు

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత నెల 11న నెలవంక దర్శనంతో 12వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలు సమాప్త మయ్యాయి. బుధవారం నెలవంక దర్శనంతో సుమారు 30రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను పాటించిన ముస్లింలు గురువారం ఈద్‌ఉల్‌ఫిత్ర్ (రంజాన్)ను జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు అన్నిచోట్ల బుధవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య నెలవంక దర్శనంతోనే మస్జీదులలో సైరన్‌లు మోగించి గురువారం రంజాన్ జరుపుకొంటున్నట్టు ప్రకటించారు. ఇక ఎండల తీవ్ర దృష్ట్యా ఉమ్మడి జిల్లాలోని వివిధ మస్జీదులలో ఆయా ప్రాంతాలను బట్టి ఉదయం 8.30 నుంచి 9.30 వరకు నమాజ్‌లు జరుపుతుండగా.. ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



హనుమకొండ రాగన్న దర్వాజ మసీదు వద్ద కనిపించిన నెలవంక

మత సామరస్యం, భక్తిభావం...

పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా ముస్లింలు.. నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి పేదల ఆకలి గుర్తెరుగుతూ ఆపై రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలిచే విశిష్టమైన శుభప్రదమైన రంజాన్ మాసానికి స్వాగతం పలకడానికి షాబాన్ మాసం నుంచే అన్ని విధాల సిద్ధపడి ఉంటారు. చంద్రదర్శనాన్ని బట్టి ఉపవాసాలు 29 లేదంటే 30 రోజుల పాటు కొనసాగుతాయి. గతేడాది 29రోజుల దీక్షలు కొనసాగగా.. ఈ ఏడాది 30 రోజులు జరిగాయి. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ 30 రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు

▸▸ మిగతా 8వ పేజీలో..

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, పేదవారికి దానం లాంటివి జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అల్లా దయతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

బుధవారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 36.5°C | కనిష్ఠం : 23.5°C

విద్యార్థుల సృజనాత్మకతకు ప్రేరణ దోహదం

▸▸ ఏఎంవోలు శ్రీనివాస్, సారయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను ప్రేరేపించేందుకు 'ప్రేరణ' ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనగామ, వరంగల్ జిల్లాల ఏఎంవోలు బొమ్మనబోయిన శ్రీనివాస్, మాలోత్ సారయ్య అన్నారు. బుధవారం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో వరంగల్, జనగామ జిల్లాల విద్యార్థులకు ప్రేరణ ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగివున్న విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాల వెలికితీతకు ప్రేరణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్, పాటలు, పద్యాలు, రచన, కార్టూన్లు గీయడం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జనగామ జిల్లాలోని 88 పాఠశాలల నుంచి 172 మంది విద్యార్థులు, వరంగల్ జిల్లాలోని 122 పాఠశాలల నుంచి 243 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారిగా జేఎన్‌వీ ఇంచార్జి ప్రిన్సిపాల్ హీరాలాల్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.

పడిపోయిన మిర్చి ధరలు

- ▸▸ ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ.12వేలు తగ్గిన దేశీ మిర్చి రేటు
- ▸▸ ఇతర రకాలకు స్వల్పంగా తగ్గిన ధరలు



ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి రైతులు తీసుకువచ్చిన మిర్చి

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు అమాంతం పడిపోయాయి. మార్కెట్‌కు గురువారం నుంచి వరుసగా నాలుగు రోజులు సెలవులు వస్తుండడంతో రైతులు సుమారు 70వేల బస్తాల మిర్చిని అమ్మకానికి తీసుకువచ్చారు. దీంతో మార్కెట్ కార్యాలయం చుట్టూ, మిర్చి యార్డు, పల్లి, పసుపు యార్డులు మిర్చి బస్తాలతో నిండిపోయాయి. గత నెల మార్చి 6వ తేదీన మార్కెట్‌లో దేశీ రకం మిర్చి క్వింటాకు రూ.38 వేలు పలుకగా, బుధవారం వ్యాపారులు రూ.26వేలతో కొనుగోలు చేశారు. ఒక్క నెలలోనే దేశీ రకం మిర్చి ధర రూ.12వేలు తగ్గిపోయింది. ఇతర రకాల మిర్చి ధరలు సైతం రూ.వెయ్యి, రూ.2వేల వరకు తగ్గిపోయాయి.

ఇబ్బందులు పడుతున్న మిర్చి రైతులు

ఆరుగాలం కష్టపడి పంట సాగు చేసి అమ్మకానికి మార్కెట్‌కు తీసుకువస్తే వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి బస్తాలను ఇంట్లో నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం.. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుందామంటే జాగా లేదనడంతో మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన బస్తాలను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో చేసేదేమి లేక వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు.

మిర్చి ధరల పట్టిక

మిర్చి రకం క్వింటాకు రూ..	ఫిబ్రవరి 6వ తారీకు	మార్చి 6వ తారీకు	ఏప్రిల్ 10వ తారీకు
తేజ	21,800	20,300	19,000
వండర్‌హాట్	21,000	19,500	15,500
యుఎస్-341	21,000	18,000	15.200
దీపిక	23,500	-----	-----
దేశీ	-----	38,000	26,000
సింగిల్‌పట్టి	-----	42,500	43,500
తాలు	8,800	8,500	7,000

తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలి

▸▸ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10: తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి బుధవారం రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వేసవిలో తాగునీటి సరఫరా, ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ వేసవి కాలం పూర్తి చేసుకుని వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరా అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు, నీటి పునరుద్ధరణ వివరాలు మీడియాకు తెలియచేయాలని అన్నారు. తాగునీటికి సంబంధించి ప్రజలుఎక్కడా ఆందోళనలు చేయకుండా చూసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్, క్షేత్ర స్థాయిలో వచ్చే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్ర స్థాయి నుంచి రెగ్యులర్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కౌసల్యాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, మునిసిపల్ కమిషనర్స్, మిషన్ భగీరథ ఈఈ రాజకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

లక్ష మల్లెలతో భద్రకాళి అమ్మవారికి అర్చన

▸▸ రెండో రోజుకు వసంత నవరాత్రోత్సవాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 10: వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, ఉత్సవ పూజ, అర్చన, అభిషేకాల అనంతరం అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చకులు అర్చన నిర్వహించారు. తెలుపు రంగు సత్వగుణాకి ప్రతీక, వైష్ణవి శక్తి విష్ణు రూపంలో ఉండి ఈ లోకాన్ని పరిపాలిస్తూ రక్షిస్తున్నదని, ప్రజలందరు శాంతి సౌభాగ్యాలతో జీవించడానికి ఈ ఆరాధన ఉపయోగపడుతుందని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారికి అర్చన చేస్తున్న అర్చకులు

వడదెబ్బతో రైతు మృతి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 10 : వడదెబ్బకు గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నర్సంపేట మండలం ముగ్దుంపురంలో బుధవారంచోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బాదావత్ మోహన్(56) గ్రామ శివారులోని మొక్కజొన్న చేను వద్దకు బుధవారం మధ్యాహ్నం కాపలా కాయడానికి వెళ్లాడు. ఎండ తీవ్రంగా ఉండడంతో వడదెబ్బ తగిలి వాంతులు చేసుకొని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మోహన్‌ను గ్రామంలోని ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.



మోహన్ (ఫైల్)

రంజాన్‌కు పోలీసు బందోబస్తు

▸▸ ఈద్గాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ

మట్టెవాడ, ఏప్రిల్ 10: రంజాన్ పండుగను పురస్కరించుకొని వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈద్గాలు, మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాట్లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం పరిశీలించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం వరంగల్ మట్టెవాడ జెమిని థియేటర్ వద్ద గల ఈద్గాను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులకు సూచనలు చేశారు. వరంగల్ పరిధిలో మట్టెవాడ ఈద్గా, ఎల్బీనగర్ ఈద్గా, చింతల్ ఈద్గా, ఎల్బీనగర్ అబునస్ ఫంక్షన్ హాల్, మండిబజార్ జమ మసీద్, కౌసర్ మసీదు, ఉర్సు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ ప్రాంతాల్లో 100 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ, శాంతి భద్రతల విభాగం, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ నందిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, ట్రాఫిక్ సీఐ శ్రీధర్ పాల్గొన్నారు.



వరంగల్ మట్టెవాడ ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రవిచంద్ర

ముస్లిం సోదరులకు రాజ్యసభ సభ్యుడు వొద్దిరాజు రవిచంద్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో తెలంగాణలోని ముస్లింలు ఉపవాస దీక్షలు చేయడంతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, ప్రేమ, దయ, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకోవాలని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.



నేడు కేయూలో పూలే జయంతి సంబురాలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: మహాత్మజ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ దూరవిద్య ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విచ్చేస్తారని, అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు,విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు



మహదేవపూర్‌లో ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 10: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. లైసెన్సు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం చేయడమే కాకుండా అధిక వడ్డీకి రుణాలు ఇస్తున్న వారి ఇళ్లను సోదాలు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో వేంనూరి వెంకట్‌రెడ్డి, సూరారం గ్రామంలో నాగిళ్ల మనోజ్ కుమార్ ఇళ్లను తనిఖీ చేసి విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. లైసెన్సులు లేకుండా ఫైనాన్స్ దందా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

కాటారంలో..

కాటారం : అధిక వడ్డీలు, తనఖాలు పెట్టుకుని అప్పులు ఇచ్చే వారి ఇళ్లపై పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అభినవ్, నరేష్, మహేందర్, హరిశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు చేసి పలు విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అధిక వడ్డీలకు అప్పులిస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వీరిలో పలువురిపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరావు తెలిపారు.

సమన్వయమే సవాల్!

(5వ పేజీ తరువాయి)

చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కడియం శ్రీహరి ఏప్రిల్ 2న వివరణ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నుంచి ఒక్క రుపాయి ఫండ్ తీసుకున్నట్లు నిరూపించిన శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. అయినప్పటికి గులాబీ పార్టీతో పాటు కాంగ్రెస్‌లోనూ ఈ ఫండ్ విషయమై చర్చ జరుగుతోంది. ఏ పార్టీలోనైనా అభ్యర్థి ఖరారు కాగానే పార్టీ ఫండ్ ఇస్తారని, ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకెళ్లటం సాధ్యం కాదు కాబట్టి ముందుగానే ఇస్తారనే చర్చ జరుగుతోంది. కావ్యకు టికెట్ మార్చి 13న బీఆర్‌ఎస్ టికెట్ ఖరారవగా.. ఆమె 27వ తేదీన రాజీనామా చేశారు. అంటే ఈ రెండు వారాలు బీఆర్‌ఎస్‌లో కడియం ఎపిసోడ్ ఏం జరిగిందనే చర్చ అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్‌లో జరుగుతుంది. రాజకీయాల్లో నీతి, నిజాయితీ పరుడిగా పేరున్న కడియంపై గులాబీఫండ్ ఆరోపణలు ఓ మరకలా మారిందనే చర్చ జరుగుతోంది.

రేవూరికి బాధ్యతలపై కేడర్ నారాజ్..

పుండు మీద కారం చల్లినట్లుగా అధిష్ఠానం వ్యవహారం కేడర్‌ను మరింతగా రెచ్చగొడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదట్లో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మంత్రి కొండా సురేఖ వ్యవహరించారు. అయితే కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక కాగానే. సురేఖ స్థానంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో కేడర్‌లో పాత మిత్రులంతా ఒక్కటవుతున్నారనే సంకేతాలు వెళ్లతున్నాయనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు నెలపదిహేను రోజుల ముందే బీజేపీ నుంచి ప్రకాష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి.. అనూహ్యంగా పరకాల ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో సీనియర్ నేతే అయినప్పటికి కాంగ్రెస్ రాజకీయాల్లో కేవలం 4నెలల అనుభవం మాత్రమే ఉంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లాల విభజన తరువాత సుదీర్ఘకాలంగా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షుడిగా పని చేయటంతో పాటు క్యాడర్‌తో సత్సంబంధాలు ఉన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి లేదంటే మంత్రి కొండా సురేఖనే వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించకుండా రేవూరిని నియమించడంపై కేడర్ నారాజ్ అవుతోంది. ఇదే సమయంలో గతంలో టీడీపీ పని చేసిన వారికే పెద్దపీట వేస్తున్నారనే ఆందోళనను పాత కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. వయస్సు రీత్యా ఆయనకు ప్రస్తుత రాజకీయాల్లో దూకుడుగా వ్యవహరించే పరిస్థితి లేదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే కడియం శ్రీహరి కుమార్తెను బలవంతంగా తమపై రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. పార్లమెంట్ బాధ్యతలు కూడా పాత కాంగ్రెస్ నేతలకు ఇవ్వకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.

ఏనుమాముల మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం, శుక్రవారం రంజాన్ సందర్భంగా సెలవు, శనివారం వారాంతపు యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందన్నారు. మార్కెట్‌లో సోమవారం నుంచి యథావిధిగా సరుకుల క్రయవిక్రయాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు.

హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నయా మోసం

ఏజెంట్లతో కుమ్మక్కై ఓ ప్రైవేటు ఆస్పత్రి కక్కుర్తి ● 18నెలల్లో రూ.2.67లక్షల స్వాహా



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10: హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రయివేట్ ఇన్సూరెన్స్ సొమ్ములను కాజేసేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 18 నెలల కాలంలో రూ. 2.67లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ వైద్యులు లేకున్నప్పటికీ వారి పేర్లను ఉపయోగిస్తూ ఆపరేషన్లు చేసినట్లు రికార్డులు సృష్టించి భారీ మొత్తంలో నిధులు స్వాహా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.67లక్షలు స్వాహా

బాలసముద్రంలోని ఈ ఆస్పత్రికి కేవలం 50 పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ పడకల్లో 18-07-2022 నుంచి 31-03-2023 వరకు 143 క్లైయిమ్స్‌లో రూ. 67 లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 2 కోట్లను స్వాహా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఈ ఆస్పత్రికి 27 వివిధ రకాల ఇన్సూరెన్స్‌లు అనుసంధానమై ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఒక ఇన్సూరెన్స్ నుంచే ఇన్ని కొల్లగొట్టినట్లుగా మరో ఐదు ఇన్సూరెన్స్‌ల కంపెనీ నుంచి ఇంకెన్ని దిగమింగారో లెక్కలు తేలాల్సి ఉంది.

ఏజెంట్ల మాయ

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సదరు ఆస్పత్రి ఏజెంట్లను మచ్చిక చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు ఒక రోగికి అయిన బిల్లుల్లో 20శాతం కమిషన్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒక ఇంట్లో ఒకరి పేరు మీద ఆరోగ్య బీమా ఉంటే అదేఇంట్లోకి మరొక వ్యక్తికి ఏదైనా ఆరోగ్య సమస్యవస్తే ఆరోగ్య బీమా ఉన్న వ్యక్తి పేరుతో ఇక్కడ చికిత్స అందిస్తారు. ఈరకంగా ఆరోగ్య బీమా కంపెనీలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇందుకు ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఓ రోగికి ఏదైనా ఆపరేషన్ చేయాలంటే ఇన్సూరెన్స్ కంపెనీలు ప్యాకేజీలు నిర్ణయిస్తాయి. అంతకంటే ఎక్కువ ఖర్చు అయితే కోపేమెంట్‌గా ఆస్పత్రి యాజమాన్యాలు డబ్బులు స్వీకరిస్తాయి. చికిత్స పొందిన రోగి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొందరు ఇన్సూరెన్స్ ఏజెంట్లు బాలసముద్రంలోని ఆస్పత్రితో కుమ్మక్కై ఎలాంటి కోపేమెంట్ లేవని రోగులను ఇక్కడికి పురమాయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతీ రోగికి ఓపెన్ బిల్లే..

ఇన్సూరెన్స్ ప్రకారం ఏదైనా రోగికి చికిత్స అందిస్తే ఐదు రోజులు ఆస్పత్రిలో ఉంటే ఓపెన్ బిల్ విధానం అమలులో ఉంది. ఈ విధానం ప్రకారం ఎంత బిల్ అయినా క్లైయిమ్ చేయవచ్చు. ఈ నిబంధనలు ఆసరాగా తీసుకొని చక్రం తిప్పుతున్న ఓ ఆస్పత్రి అవసరం లేని రోగులను కూడా ఐసీయూ, కార్డియాక్, ఎమర్జెన్సీ విభాగాల్లో రోజులకొద్ది ఉంచుకొని ఓపెన్ బిల్లింగ్ విధానం ద్వారా బీమా క్లైయిమ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రోగి ఒక పేరు మీద ఉంటే మరో రోగి పేరుతో చికిత్స అందిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

సీబీసీఐడీ విచారణకు డిమాండ్

నగరంలో 250 పడకల ఆస్పత్రిలు చాలా ఉన్నాయి. పైగా ఇవి చాలా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నాయి. ఇలాంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అన్ని సిద్ధంగా ఉన్నాయి. వీటి క్లైయిమ్స్ కూడా లక్షలు దాటడం లేదు. అయితే హనుమకొండ బాలసముద్రంలోని 50 పడకల ఆస్పత్రిలో కేవలం 18 నెలల కాలంలో రూ. 2.67 కోట్ల క్లైయిమ్స్ కేవలం ఒకే సంస్థ ద్వారా జరగడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా 27 ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇంకెన్ని జరిగాయోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఈ లావాదేవీలపై సీబీఐచే విచారణ జరిపించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల

● కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు దిగివచ్చిన దేవాదాయ శాఖ అధికారులు ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. ధార్మిక భవన్‌లో పాఠశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పక్షం రోజుల్లో పాఠశాలను భవన్‌లోకి తరలించనున్నారు. భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో అధికారికంగా తెలిపారు. ధార్మిక భవనంలో వేద విద్యార్థుల నివాసం కోసం మొదటి అంతస్తును, తరగతి గదుల నిర్వహణకు నాలుగో అంతస్తును కేటాయించనున్నట్లు తెలిపారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అవసరమైన వసతుల కల్పనకు పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ఎట్టకేకు దిగివచ్చి..

భద్రకాళి ఆలయం చుట్టూర మాడవీధుల నిర్మాణం జరుగుతున్న క్రమంలో వేద పాఠశాలను ధార్మిక భవనంలోకి మార్చాలన్న ప్రతిపాదనను దేవాదాయ శాఖ అధికారులు మొదట నిరాకరించారు. ఘోషిస్తున్న వేద పాఠశాల శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త వచ్చిన సంగతి తెలిసిందే. దీనితో ఈ విషయం కలెక్టర్ సిక్తా పట్నాయక్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి వెళ్లింది. మంత్రి కలెక్టర్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను పిలిపించుకొని మాట్లాడారు. వేద పాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించాలని ఆదేశించినట్టు తెలిసింది. దీనితో దేవాదాయ శాఖ అధికారులు వేద పాఠశాలకు ధార్మిక భవన్‌లో చోటు కల్పించేందుకు సమ్మతించారు.



వేద పాఠశాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

వేరు వేరు అంతస్తుల్లో...:

ధార్మిక భవనంలోని మొదటి అంతస్తును, నాలుగో అంతస్తును వేదపాఠశాలకు కేటాయించాలని నిర్ణయించారు. కింద అంతస్తులో విద్యార్థులు ఉండడానికి డార్మెటరీలను ఏర్పాటు చేస్తారు. వారికి అవసరమైన భోజనాల కోసం కిచెన్‌ను కిందనే ఏర్పాటు చేయనున్నారు. పైన నాలుగో అంతస్తులో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు. వేద పాఠశాలకు విద్యార్థుల సంరక్షణను చూసేందుకు ప్రస్తుతం ఒక కేర్ టేకర్ కూడా ఉన్నారు. అయన కుటుంబంతో సహా పాఠశాలలోనే నివాసముంటున్నందువల్ల ధార్మిక భవన్‌లో కూడా అయనకు ప్రత్యేకంగా ఒక గదిని కూడా కేటాయించాల్సి ఉంది. పాఠశాలకు సంబంధించిన వస్తువులు, పుస్తకాలు, ఇతర బోధనా సామగ్రిని భద్రపరచడానికి ప్రత్యేకంగా మరో గది (స్టోర్ రూం)ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని పాఠశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..

వేద పాఠశాల నిర్వహణలో ఎలాంటి అసౌకర్యాలు లేవని, దేవాదాయ శాఖ సౌజన్యంతో పాఠశాల నిర్వహణకు అన్ని రకాల సహకారం అందిస్తున్నామని శ్రీ భద్రకాళి దేవస్థానం ఈవో శేషభారతి తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఘోషిస్తున్న వేదపాఠశాల' శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. ధార్మిక భవనంలో కేటాయించిన స్థలం వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అనుకూలంగా ఉంటుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని శ్రీ భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఏప్రిల్ 10 : భారతీయ స్టేట్ బ్యాంక్-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, టైలరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ మాధురి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 యేళ్ల లోపు ఉండి, తెలుగులో చదవడం, రాయడం వచ్చి, తెలుపు రేషన్ కార్డును కలిగి ఉండాలన్నారు. చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు, మునిసిపాలిటీకి చెందిన వారు అర్హులు కాదన్నారు. శిక్షణ ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకాలంలో అభ్యర్థులకు ఉచిత వసతితో పాటు భోజనం ఉంటుందని, శిక్షణ కాలంలో కోర్స్‌కు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా అంచనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లో గల ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ నందు ఈ నెల 14 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మే 6 నుంచి డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవి షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు అలాగే నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 24,27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు బీసీఏ, బీ వొకేషనల్, బీహెచ్ఎం-సీటీ, పీడీసీ సెమిస్టర్ కోర్సుల పరీక్షలను కూడా నిర్వహిస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా రవీంద్రనాయక్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 10: కాంగ్రెస్ కమిటీ వరంగల్ జిల్లా ఎస్టీ విభాగం చైర్మన్‌గా సంగెం మండలం పెద్దతండాకు చెందిన గుగులోతు రవీంద్రనాయక్ నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు టీపీసీసీ ఎస్టీ విభాగం చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవీంద్రనాయక్ పేర్కొన్నారు.



ఉత్తమ పౌర పురస్కారాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గురుధామంలో ఉగాది ఉత్తమ పౌర పురస్కారాలు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ పైడిపెల్లిలోని గురుధామంలో(సప్తధామ్) ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురికి ఉత్తమ పౌర పురస్కారాలు అందజేశారు. శివానందగురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ముగ్గురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఏటూరునాగారంకు చెందిన డాక్టర్ బండ్ల వరప్రసాద్, కూచిపూడి నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌రావు, హనుమకొండకు చెందిన ట్రైనీ కలెక్టర్ శ్రీసాయి అశ్రిత్‌కు రూ.5వేల నగదు, మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ విజిలెన్స్ ఏసీపీ శ్రీనివాసరావు, శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్, గండ్లూరి రాజశేఖర్, బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, పబ్బ విశ్వేశ్వర్, వెంకటరమణ, సుదర్శన్‌రావు, స్వామి, కృష్ణచైతన్య, ఆనంద్, రాంరెడ్డి, ప్రియాంక, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రం ఆవిష్కరణ

కాజీపేట, ఏప్రిల్ 10: యువతలో దేశభక్తి, జాతీయభావం పెంచి హిందువుల ఏకీకరణ చేయడం కోసం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పని చేస్తున్నాయని వీహెచ్‌పీ వరంగల్ మహానగర్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ నెల 23న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న వీర హనుమాన్ కరపత్రాల పోస్టర్‌ను బుధవారం కాజీపేటలోని మీడియా పాయింట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీలో భాగంగా ఈ నెల 23న రంగశాయిపేట మహంకాళి దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి కరీమాబాద్, వరంగల్ చౌరస్తా మీదుగా పద్మాక్షి దేవాలయం హనుమత్‌గిరి వరకు యాత్ర సాగుతుందన్నారు. హిందూ ధర్మప్రచారకులు రాధా మనోహర్ ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి ఆదిత్యసాయి, దార ధనుంజయ్, అరవింద్, వినయ్, అరుణ్, విజయ్, లక్ష్మణ్, నాగార్జున, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉదయ్ కుమార్

ఆర్‌వోబీపై లారీ ఢీకొని వ్యక్తి మృతి

మడికొండ, ఏప్రిల్ 10 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేట మండలం కడిపికొండ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. తెల్లవారితే రంజాన్ పండుగ ఉండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన ఎమ్డీ బషీరుద్దీన్(60) బుధవారం కడిపికొండ నుంచి బైక్‌పై కాజీపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆర్‌వోబీ పైకి రాగానే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బషీరుద్దీన్ కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బషీరుద్దీన్ భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య మాత్రమే ఉందని ఎస్సై రాజబాబు పేర్కొన్నారు.



మృతిచెందిన బషీరుద్దీన్

మండే ఎండలో విధులా?

- మధ్యాహ్నం 1గంట వరకు పారిశుధ్య సిబ్బందికి పనులు
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- పునరాలోచించాలని వేడుకోలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 10: భానుడు నిప్పులు కురిపిస్తున్నాయి. ఉదయం 8గంటలకే ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఎండలో బయటకు వెళ్లి రావాలంటేనే జనం భయపడుతున్నారు. అయితే బల్దియా పారిశుధ్య కార్మికులు మాత్రం మధ్యాహ్నం 1గంట వరకు పనిచేయాలని ఉన్నతాధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బల్దియా పరిధిలో పారిశుధ్య పనులు చేసే సిబ్బంది ఇకపై ఒక్క పూట విధులు నిర్వర్తించాలని తెలిపారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా గురువారం నుంచి ఎండాకాలం ముగిసే వరకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సిబ్బంది వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు నిబంధనలు పాటించాలని తెలిపారు.

గతంలో ఇలా..

యేటా జూన్ నుంచి మార్చి వరకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పారిశుధ్య కార్మికులు పనులు నిర్వహిస్తారు. కానీ ఎండాకాలంలో సిబ్బంది పడే ఇబ్బందిని గుర్తించి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉదయం 5 నుంచి 11.30 గంటల వరకు అధికారులు విధులు కేటాయిస్తారు. వేసవికాలంలో ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పూర్తిగా ఒక్క పూట మాత్రమే పని కల్పించాలనే నిబంధన ఉంది. గత మున్సిపల్ కమిషనర్, పాలక వర్గం ఉదయం 11గంటల వరకే పారిశుధ్య కార్మికులతో పనిచేయించేవారు. కానీ ప్రస్తుత కమిషనర్ అందుకు విరుద్ధంగా మధ్యాహ్నం 1గంట వరకు పని చేయాలని సూచించడంతో చాలామంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మండేఎండలో ఎలా పనిచేయాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



తెల్లవారుజామున విధులకు వస్తున్న పారిశుధ్య కార్మికులు(ఫైల్)

కార్మికుల అసహనం

వరంగల్ మహానగర పరిధిలోని డివిజన్లలో పారిశుధ్య కార్మికులు కాలనీలలో తిరుగుతూ చెత్త సేకరించడం నుంచి మొదలుకొని రోడ్లు ఊడ్చడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం చేస్తుంటారు. ఈ వేసవిలో కమిషనర్ ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. నగరానికి సుమారు 20, 30 కిలోమీటర్ల దూరం నుంచి ఉదయం 4 గంటలకు వచ్చి 5 గంటలకు బయోమెట్రిక్ ద్వారా హజరు వేసుకుని 1 గంటవరకు ఎండలో విధులు నిర్వర్తించాలంటే చాలాకష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పూట అన్నట్టే గానీ.. ఎండలో పని చేయడం, భోజనహారాలు లేకుండా విధులు నిర్వర్తించడంవల్ల స్పృహతప్పి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందంటున్నారు. ఇళ్ల యజమానులు కనీసం మంచి నీళ్ల కూడా ఇవ్వరని వాపోతున్నారు. అయితే గతంలో మాదిరిగా ఎండాకాలంలో ఉదయం 5 నుంచి 11.30 వరకు విధులు కేటాయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కమిషనర్, పాలక మండలి, అధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే నిరసన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

సంఘాలు, నాయకుల జాడెక్కడ?

బల్దియా కార్మికుల సమస్యలే మా సమస్యలు.. కార్మికుల కష్టాలే మా కన్నీళ్లు.. అని గొప్పలు చెప్పుకునే కార్మిక సంఘాలు, జేఏసీ నాయకులు ఎక్కడ అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కమిషనర్ నిర్ణయంపై ఏ సంఘం నాయకుడు స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. పారిశుధ్య కార్మికుల నుంచి సంవత్సర చందాలు, సభ్యత్వాలు, సభలు, సమావేశాలు, ఎల్ఐసీల పేరుతో క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేసే కొన్ని సంఘాల నాయకులు అడ్రస్ లేకుండా పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అన్ని సంఘాలు, జేఏసీ ఒక్కటై శానిటేషన్ సిబ్బంది పని వేళల్లో మార్పు వచ్చే విధంగా చూడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పని గంటలు తగ్గించాలి

బొట్ల భిక్షపతి మాదిగ. టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు



పారిశుధ్య కార్మికులు ఎండలో పని చేయాలంటే చాలా కష్టం. ఎండాకాలంలో కార్మికులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పని చేయించేవారు. కానీ ప్రస్తుత బల్దియా కమిషనర్ 1గంట వరకు పనిచేయాలని ఆదేశించడం సరికాదు. కమిషనర్ పునరాలోచించి పని గంటలు తగ్గించాలి. లేదంటే కార్మికుల పక్షాన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతాం.



నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

కరీమాబాద్, ఏప్రిల్ 10 : విద్యుత్ సౌకర్యంలో అంతరాయాలు కలుగకుండా వినియోగదారులకు నిరంతరం సరఫరా చేయాలని ఎన్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కెకిషన్ అన్నారు. బుధవారం ఉదయం శంభునిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా గవిచెర్ల రోడ్డు ఫీడరు కింద ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌ను 3 కి.మీ వరకు కాలినడకన తిరిగి పరిశీలించారు. అనంతరం విద్యుత్ కార్యాలయానికి చేరుకొని సిబ్బందికి సూచనలు చేశారు. విద్యుత్ కార్యాలయ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లకు వైండింగ్‌లు లేకుండా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్‌పిట్‌లకు వాటరింగ్ చే యాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, డీఈ శెంకేషి మల్లికార్జున్, ఏడీఈ గణేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణ, దావుద్, ఎల్ఎం బొమ్మిరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4 ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు ఇచ్చే శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కులం, ఆదాయం, నివాసం, డిగ్రీ సర్టిఫికెట్స్‌తో హనుమకొండ ఇందిరానగర్‌లోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ సమీపంలోని కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9346374583, 6302885783, 9908155090 సెల్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు గాడెపల్లిలో దేవాలయ ప్రారంభోత్సవం

సంగెం, ఏప్రిల్ 10 : ఖిలావరంగల్ మండలం గాడెపల్లి గ్రామంలో శ్రీకోదండ రామచంద్రస్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి శనివారం వరకు జరిగే ఆలయ ప్రారంభోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావాలని నిర్వాహకులు కోరారు. సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు.

ఎంహెచ్‌డీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిశోర్


కిషోర్‌కు కండువా కప్పుతున్న గనిపాక ప్రదీప్

కరీమాబాద్, ఏప్రిల్ 10: మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొగిలిచెర్ల గ్రామానికి చెందిన గనిపాక కిషోర్ నియామకం అయ్యారు. నగరంలోని 39వ డివిజన్‌లో బుధవారం జరిగిన మాదిగ హక్కుల దండోరా ముఖ్య నాయకుల సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ మాదిగల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం నిస్వార్థంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఎంహెచ్‌డీ నాయకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్‌కు కిశోర్ కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల ఆత్మగౌరవం కోసం తనవంతు పోరాటాలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌డీ జిల్లా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కాపులకనుపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సంగెం, ఏప్రిల్ 10 : మండలంలోని కాపులకనుపర్తి గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. కాపులకనుపర్తి సొసైటీ పరిధిలోని తీగరాజుపల్లి, షాపూర్, కాపులకనుపర్తి గ్రామాలతో పాటు పలు గ్రామాల రైతుల వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో లావణ్య, సీఈవో రమణాచారి, సెంటర్ ఇన్‌చార్జి మాలతి, భిక్షపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

గీసుగొండ, ఏప్రిల్ 10: మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన డక్కు కనకయ్య, విశ్వనాథపురం గ్రామానికి చెందిన అజ్మీర లచ్చమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా వ్యక్తుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున సామాజికవేత్త, కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి పంపించిన నగదును అందచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, కక్కెర్ల సుభాష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాగరాజు, క్రాంతి, రఘు, రవి, చింటు, లింగమూర్తి, కిరణ్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి ప్రణాళిక అమలేది?

నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ
వడదెబ్బపై కనబడని అవగాహన కార్యక్రమాలు
పీహెచ్‌సీలకే పరిమితమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10 : జిల్లాలో ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పది తరువాత రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం, భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉండటంతో మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటే జెంబేలెత్తుతున్నారు. బయటకు వెళ్తే చాలా మంది వడదెబ్బకు గురవుతున్నారు. మున్ముందు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ, వేసవి వచ్చిన తరువాత తొలుత అప్రమత్తం కావాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుంది. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించడం, వడదెబ్బ తగిలిన వారికి వెంటనే చికిత్స అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. జిల్లా పరిస్థితులపై కనీసం సమీక్షలు సైతం నిర్వహించడం లేదని పలువురు వాపోతున్నారు.

వేసవి ప్రణాళికపై నిర్లక్ష్యం

జిల్లాలో వేసవి ప్రణాళిక అమలు చేయడంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం మార్చి నెల చివరి కల్లా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమ్మర్ అలర్ట్ ప్రకటించి పలు రకాల చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆర్ఎల్, ఎన్ఎస్ ద్రవణాలను అందుబాటులో ఉంచి ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలి. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సైతం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

కానీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమ్మర్ ప్లాన్ అమలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పీహెచ్‌సీ సెంటర్ల నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు సైతం వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించడం లేదని, అడిగిన వారికి మాత్రమే పీహెచ్‌సీలలో సేవలు అందిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

పీహెచ్‌సీలకే పరిమితమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు


దేశాయిపేట ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ భరత్‌కుమార్


వరంగల్ జిల్లా పరిధిలో ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీ సెంటర్లు (సామాజిక ఆరోగ్య కేంద్రాలు), రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నేతృత్వంలో జిల్లా పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలలో మాత్రమే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎన్ఎస్‌లు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని పలు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో కనీసం ప్రత్యేక కార్నర్లు సైతం ఏర్పాటు చేయలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. కేవలం అడిగిన వారికి మాత్రమే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.


వరంగల్ బస్టాండ్ వద్ద ఎండలో నిలబడి ఉన్న ప్రయాణికులు

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో కనబడని ఓఆర్ఎస్‌లు

జిల్లాలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణికులు ఎండ దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాలతో పాటు, నగరంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో ఎండ వేడిమి తాళలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ప్రణాళికలో భాగంగా బస్టాండ్, రైల్వేస్టేషన్లతో పాటు ప్రధాన కూడళ్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయలేదు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ ఎక్కడా కనబడటం లేదు. దీంతో ప్రజలు ఎండ వేడిమి తట్టుకోలేక వడదెబ్బకు గురవుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ సేవలు లేకపోవడంతో ప్రయాణికులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

రేపు నగరానికి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ రాక


శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 10: అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ ఈ నెల 12న వరంగల్ నగరానికి విచ్చేయుచున్నారని శ్రీగణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ఉగాది శ్రీక్రోధ నామ సంవత్సరం చైత్ర మాసంలో స్వామిజీ ములుగురోడ్‌లోని శ్రీవరద దత్త క్షేత్రంనకు విచ్చేస్తున్నారని చెప్పారు. 12న దత్తక్షేత్రంలో భక్తులకు ఏడాదిలో మంచి శుభాలు కలుగాలని ప్రత్యేకంగా నవగ్రహ హోమం ఏర్పాటు చేశారని అన్నారు. సాయంత్రం 5 గంటలకు హోమం ప్రారంభం కానుందని, 7 గంటలకు శ్రీస్వామిజీ మహా పూర్ణాహుతి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా స్వామిజీ దర్శనం అనంతరం భక్తులకు డొప్ప ప్రసాదం వితరణ జరుగుతుందన్నారు. 13న పరకాల సమీపంలోని చిన్నకోడెపాక గ్రామంలో దత్త భక్తులచే నిర్మాణం చేసిన ఆలయాలు, ప్రతిష్ఠ, కుంబాభిషేకం విగ్రహాల ప్రతిష్ఠ, పూజలు, హోమాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వామిజీ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పాల్గొని మహా పూర్ణాహుతి చేసిన తర్వాత భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారని ఆ వెంటనే స్వామిజీ హైదరాబాద్ వెళ్తారని వామన్‌రావు తెలిపారు. భక్తులందరు హోమం, ఆలయ ప్రతిష్ఠలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ శివరామకృష్ణ ప్రసాద్, బెండల అర్జున్‌రావు, చకిలం ఏకాంబరం, అడ్డగూడి వెంకటేశ్వర్లు, వొద్దిరాజు శార్వాణి, తోట శివకుమార్, విజేందర్‌రెడ్డి, యుగంధర్, జూలూరి శ్రీనివాస్, ఓంప్రకాష్, వడ్డె రవీందర్, మేడిశెట్టి కుమారస్వామి, కొక్కుల రాజేంద్రప్రసాద్, వడిచర్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

కరీమాబాద్, మార్చి10: వరంగల్ రంగశాయిపేటలోని చారిత్రక శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 17న శ్రీరామ నవమి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగానే బుధవారం ఆలయంలో వేదపండితులు ఆలయ ప్రధాన అర్చకుడు తిరుమల శ్రీధరాచార్యులు, గ్రామ పురోహితులు వెలిదే భార్గవశర్మల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ లగ్నపత్రికకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆవిష్కరించారు. కల్యాణ వేడుకలు, స్వామి వారికి చేసే విశేష వాహన సేవలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా దేవాలయంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నెక్కండి వెంకట్రావు తెలిపారు. ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వలుపదాసు కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ స్థలదాతలు వద్దిరాజు రంగారావు, శ్యాంసుందర్‌రావు, లక్ష్మీకాంతరావు, గ్రామస్తులు కొల్లూరి యోగానందర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, అనిల్, ఆవునూరి కుమారస్వామి, గంద్రాతి కుమార్, మనోహర్, కర సేవకులు పాల్గొన్నారు.

శంభునిపేటలో..

శంభునిపేట కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ఈనెల 17న నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించి లగ్నపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమాన్ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ శ్రీ రామ నవమి వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నల్ల రాంబాబు భార్గవ, దేవలపెల్లి దయాకర్, కందగట్ల శ్రీరామ్, కూచన వినయ్, సిందం మహేష్, దేవులపెల్లి శ్రీధర్, శ్రీకాంత్, శ్రీనాథ్, వనం అంజి, స్థానిక భక్తులు, మహిళలు, కరసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గంటా' జన్మదిన వేడుకలు


బీజేపీ కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న రవికుమార్

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 10: బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ధర్మారంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల నడుమ గంట జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. శివనగర్‌లోని ఆయన నివాసంలో కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కరీమాబాద్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ జన్మదిన వేడుకలను 42వ డివిజన్ రంగశాయిపేటలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గంటా రవికుమార్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో 39వ డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు, 40వ డివిజన్ అధక్షుడు ఆకుతోట రాజు, 41వ డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, డివిజన్ ఇంచార్జి మోహనాచారి, 27వ డివిజన్ ఇంచార్జి కర్నె రవి, నాయకులు బక్కి రంజిత్, ఆరె కార్తీక్, శేర్ల అనిల్, చాపల నాగరాజు, దూదె పరమేష్, రంజిత్, చందు, రాకేష్, కిషన్, శివచందర్, భిక్షపతి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

సంగెం, ఏప్రిల్ 10 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. సంగెం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నేతలు న్యాల రమేశ్ యాదవ్, బండకింది శ్రవణ్‌లతోపాటు పలువురు బుధవారం బీజేపీలో చేరారు. వరంగల్‌లోని తన నివాసంలో గంటా రవికుమార్ నేతలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి అనేక మంది బీజేపీలో చేరుతున్నట్లు చెప్పారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరు శ్రీనివాస్, పరకాల నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రహముల్లా, గౌరెలకాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క చేరాలు, గీసుగొండ మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, సంగెం మండల ఉపాధ్యక్షుడు గోనె ముకుందం, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రంగరాజు క్రిష్ణ, తీగరాజుపల్లి బూత్ అధ్యక్షుడు రంగరాజు ప్రభాకర్ పాల్గొన్నారు.

వాగ్దేవి క్రికెట్ ట్రోఫీ విజేతలుగా ఎస్ఆర్ వర్సిటీ క్రీడాకారులు



వాగ్దేవి క్రికెట్ ట్రోఫీతో ఎస్ఆర్ యూనివర్సిటీ క్రికెట్ టీం

సంగెం, ఏప్రిల్ 10 : వాగ్దేవి క్రికెట్ ట్రోఫీని ఎస్ఆర్ యూనివర్సిటీ, శ్రీ చైతన్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టీం కైవసం చేసుకుంది. బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో వారం రోజులుగా జరుగుతున్న వాగ్దేవి ట్రోఫీ టోర్నమెంట్స్ బుధవారం ముగిసాయి. ఈ పోటీల్లో వాగ్దేవి ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ యూనివర్సిటీ 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ చైతన్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టీం 15.2 ఓవర్లలోనే 113 పరుగులు చేసి ఆలౌట్ అయ్యి రన్నర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో 39 బంతుల్లో 67 పరుగులు చేసిన పంతగాని రిష్వంత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటుగా టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు (219 పరుగులు) చేసినందుకు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు కూడా సాధించాడు.

ఇంటి వద్దకే భద్రాచలం సీతారామస్వామి తలంబ్రాలు


తలంబ్రాలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

గిర్మాజిపేట, ఏప్రిల్ 10 : భద్రాచలంలో ఈ నెల 17న జరిగే శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా ఇంటి వద్ద పొందే కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం వరంగల్‌లోని తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో హనుమకొండ డీఎం బి.ధరమ్‌సింగ్ ఆవిష్కరించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం తలంబ్రాలు పొందాలనుకునే భక్తులు వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని లాజిస్టిక్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ లోగా రూ.151 చెల్లిస్తే ఇంటికే తలంబ్రాలు వస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ సిబ్బంది ఎండి.గౌస్, ఎండి.పాషా, కార్గో ఇంచార్జి రవి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఈద్ ఉల్ ఫిత్ర్'

(5వ పేజీ తరువాయి)

మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. మానవుడిలో ప్రేమాభిమానాలు, క్రమశిక్షణ, కర్తవ్యపరాయణత్వం, సహనం, దాతృత్వం, పవిత్ర జీవనం, న్యాయ మార్గానుసరణం, ఆర్థిక సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం తదితర ఉత్తమ గుణాలు అలవడుతాయని చెబుతారు. ఈ అలవాటు చేసేందుకు దేవుడైన అల్లాహ్ ప్రతీయేడు మానవ జాతికి రంజాన్ మాసాన్ని ప్రసాదించాడని ముస్లింలు భావిస్తారు.

ఆకలి బాధను గుర్తెరిగే రోజా..

రంజాన్ ఉపవాస దీక్షగా వ్యవహరించే 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయిమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ఈ ఉపవాసదీక్షల వల్ల నిర్మలమైన, నిశ్చలమైన భక్తిభావం ఏర్పడడమే కాకుండా ఆకలి బాధతో అల్లాడే దీనజనుల కష్టాలను స్వయంగా ఉపవాస దీక్షల ద్వారా గుర్తించే అవకాశం లభిస్తుందని విశ్వసించి నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. ఆ క్రమంలోనే రోజూ ఐదుసార్లు దైవారాధన (నమాజ్) చేశారు. రాత్రి వేళల్లో తరావి నమాజ్‌లు చేశారు. అంతేకాకుండా పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకుని గురువారం (నేడు) రంజాన్ పండుగ జరుపుకుంటున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా పంచాయతీ అధికారి కల్పన


గీసుగొండలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో కల్పన

గీసుగొండ, ఏప్రిల్ 10: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. బుధవారం గీసుగొండ, కొనాయిమాకుల గ్రామాలను ఆమె సందర్శించి నీటి సరాఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథతో పాటు బావులు, చేతిపంపులు, బోర్‌లను వాడుకలోకి తీసుకువచ్చి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్నందున నీటి సరాఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులను అమె ఆదేశించారు. పైపుల లీకేజీలను అరికట్టడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గీసుగొండ, బాలయ్యపల్లి గ్రామాల్లో 1076 కుటుంబాలకు 3 ఓహెచ్‌ఆర్‌లు, 3 బావులు, 4 బోర్‌లు, 12 చేతిపంపుల ద్వారా నీటిని అందిస్తున్నట్లు కార్యదర్శి వేణుప్రసాద్ డీపీవో కల్పనకు వివరించారు. అనంతరం నర్సరీ, పల్లెప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామాల నిర్వాహణను ఆమె పరిశీలించారు. కాగా, గీసుగొండ గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీపీవో ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవేందర్, ఎంపీవో ప్రభాకర్, కారొబార్ అలీ, రాజు, భద్రి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందకాలనీలో పెట్రోల్ దొంగలు

అర్థరాత్రి పార్కింగ్ చేసిన వాహనాల నుంచి చోరీ

వరంగల్ సిటీ, ఏప్రిల్ 10: నగరంలోని 19వ డివిజన్ వివేకానందకాలనీలో గత కొద్ది నెలలుగా చాలా మంది వాహనదారులు తమ ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు సైతం ఫిర్యాదులు చేశారు. ఇదిలా ఉంటే మంగళవారం అర్థరాత్రి 1.40 గంటల సమయంలో వివేకానందకాలనీ రోడ్ నంబర్ 3లో జెండా గద్దె ప్రాంతంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన టూ వీలర్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్న యువకుడి దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. దీంతో పోలీసులు సైతం సదరు యువకుడిని పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు సమాచారం.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

మట్టెవాడ, ఏప్రిల్ 10: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి బుధవారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. వరంగల్ ట్రాఫిక్ పరిధిలో కాశిబుగ్గ వద్ద వరంగల్‌కు చెందిన గుగులోత్ సురేందర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. కాగా, సురేందర్‌ను మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 10 : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కి ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన సంఘటన నర్సంపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. పట్టణంలోని 8వ వార్డులోని నెహ్రూనగర్‌లో గత మూడు సంవత్సరాలు మిషన్ భగీరథ పైపులు ఏర్పాటు చేసి నీటి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మునిసిపల్ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.కార్యక్రమంలో శ్రీదేవి, సునీత, పద్మ, రమ్య, అన్నపూర్ణ, రమ, మౌనిక, లలిత, వెంకటమ్మ, సక్కుబాయి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 11 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 10 : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కి ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన సంఘటన నర్సంపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. పట్టణంలోని 8వ వార్డులోని నెహ్రూనగర్‌లో గత మూడు సంవత్సరాలు మిషన్‌భగీరథ పైపులు ఏర్పాటు చేసి నీటి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మునిసిపల్ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, సునీత, పద్మ, రమ్య అన్నపూర్ణ, రమ, మౌనిక, లలిత, వెంకటమ్మ, సక్కుబాయి, రాధ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు



ప్రైవేటు ఆస్పత్రిని తనిఖీ చేసి నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నర్సంపేట, ఏప్రిల్ 10 : గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు, అనవసరమైన అబార్షన్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, పీసీపీ ఎన్డీటీ స్కానింగ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సునై, మమత, సంగీత, న్యూ అమ్మ, మల్లిక ఆస్పత్రులను తనిఖీచేశామని అన్నారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు ల్యాబ్ లు వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని అను మతి పొందిన తర్వాతే వాటిని నిర్వహించుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రిని నిర్వహించాలంటే తెలంగాణ ప్రభుత్వం, క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్‌ఆక్ట్ ప్రకారం అన్ని అనుమతులు పొంది ఉండాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి రిజిస్ట్రేషన్‌లేకుండా, అనుమతు లు పొందకుండా నిర్వహిస్తే సదరు ఆస్పత్రులను సీజ్‌చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాత శిశుసంరక్షణ అధికారి డాక్టర్ ఆచార్య, డిప్యూటిడెమో అనిల్‌కుమార్, ఎల్‌డి కంప్యూటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రోడ్ల పనులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, ఏప్రిల్ 10 : నియోజకవర్గంలోని పెండింగ్ రోడ్లపనులను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తిచేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో టెండర్లలు, అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయని అన్నారు. కానీ, ప్రస్తుతం కాంట్రాక్టర్లు రోడ్ల పనులు చేస్తున్న దాఖలాలు ఎక్కడా కనబడతాలేవన్నారు. పెండింగ్ రోడ్ల పనులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి కాంట్రాక్టర్లతో పూర్తి చేయించాలని కోరారు. అలాగే నల్లబెల్లి మండలంలో 14బీటీ రోడ్లను ప్రారంభించాల్సి ఉందన్నారు. వేసవి కాలంలో కాకుండా ఇంకా ఎప్పుడూ ఈ రోడ్ల పనులను పూర్తి చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు బానోతు సారంగపాణి, చెట్టుపెల్లి మురళీధర్, ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, కొత్తపల్లి కోటిలింగాచారి, గందె శ్రీనివాస్ గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, ఇంగ్లీ శివాజీ, నానబోయిన రాజారాం, వక్కల చంద్రమౌళి, ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కానూరి ఆశయ సాధన కోసం పాటుపడాలి



కానూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవైఎల్, ఏఐకేఎంఎస్ నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 10 : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు, విప్లవ సాంస్కృతికోద్యమ సారథి కానూరి వెంకటేశ్వరరావు ఆశయ సాధన కోసం న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు, పీవైఎల్ కార్యకర్తలు పాటుపడాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో బుధవారం కానూరి వెంకటేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కానూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ ప్రజాగేయ రచయిత, వామపక్ష ఉద్యమాలకు, ప్రజాపోరాటాలకు ఆయన పాటలు ప్రాణం పోశాయన్నారు. నక్సల్బరీ ఉద్యమం నుంచి గోదావరిలోయ ప్రజాసాహిత్యం వరకు వ్యంగ్య రచయితగా పేరు గడించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వందలాది శిబిరాలు నిర్వహించి వేలాది మంది కళాకారులకు శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు గడ్డి కృష్ణ, మల్లన్న, రమేశ్, ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, శారద, సునీత పాల్గొన్నారు.

మార్కెట్‌లో కార్యకలాపాలు సాగేనా?

నిరుపయోగంగా పాత గోదాములు, కార్యాలయం



గోదాములో నిల్వచేసిన రేషన్ బియ్యం

పర్వతగిరి, ఏప్రిల్ 10: రైతుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి గాను నిర్మించిన సబ్‌మార్కెట్ యార్డులో కార్యకలాపాలు సాగకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు. ఆయా సీజన్లలో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేస్తుండడం, మిగతా ఏడాదంతా కొనుగోళ్లు జరపకపోవడంతో రైతులు దూర ప్రాంతాల్లోని మార్కెట్లకు తమ పంట ఉత్పత్తులను తరలిస్తున్నారు. మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్లను చేపట్టకపోవడంతో మార్కెట్‌యార్డులో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో వరి, మొక్కజొన్న కొను గోలు కేంద్రాలను నడుపుతున్నారు. దీంతో పాత గోదాములతో పాటు కార్యాలయం వృధాగా ఉంటున్నాయి.

ఏళ్లుగా మూతపడిన సబ్‌మార్కెట్ యార్డు

మండల కేంద్రంలో 2002 సంవత్సరంలో సుమారు 6ఎకరాల విస్తీర్ణంలో సబ్ మార్కెట్ యార్డును నిర్మించారు. షెడ్లు, ప్లాట్‌ఫాంలు అప్పుడే నిర్మించగా, అనంతరం రూ.60లక్షలతో కార్యాలయ భవనం ఏర్పాటు చేశారు. నాబార్డ్ సహకారంతో రూ.3 కోట్ల నిధులతో 5వేల మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములను నిర్మించారు. మార్కెట్ ఏర్పాటుకు గాను సుమారు రూ.6 కోట్ల వరకు నిధులను వెచ్చించారు. మార్కెట్ ఏర్పాటుచేసిన కొత్తలో పలు రకాల పంట ఉత్పత్తులను మార్కెటింగ్ అధికారులు, అడ్తిదారులు కొనుగోళ్లు చేపట్టారు. అనంతర కాలంలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో నెమ్మదిగా కొనుగోళ్లు మందగించాయి. కాలక్రమేణా పూర్తిగా నిలిచిపోయాయి. కొనుగోళ్లు నిలిచిపోవడంతో పాత భవనాలు, ప్లాట్‌ఫాంలు, రేకులషెడ్లు నిరుపయోగంగా మారాయి. 2015లో రూ.3కోట్లతో గోదాములను నిర్మించారు. దీంతో తిరిగి మార్కెట్ కార్యకలాపాలు చేపట్టారు.

కన్నెత్తి చూడని అధికారులు

గోదాములను నిర్మించిన అనంతరం కొన్నాళ్లపాటు సీజన్‌లలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లను చేపట్టారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇక్కడే ఉన్న గోదాముల్లో భద్రపరిచే వారు. అనంతరం ఆ గోదాముల్లో పౌర సరఫరాలశాఖకు చెందిన బియ్యం నిల్వచేయడంతో ఇక్కడ కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని నిల్వచేయడానికి స్థలం లేకుండాపోయింది. దీంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారు. మార్కెట్‌లో స్థలం విశాలంగా ఉండి రైతులు వరి, మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు వీలుగా ఉండడంతో పర్వతగిరి మండల కేంద్రానికి ఐకేపీ ద్వారా మంజూరుచేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్‌లో నిర్వహిస్తున్నారు. కల్లెడ సొసైటీకి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంజూరుకావడంతో వారు సైతం మార్కెట్ ఆవరణలోనే కొనుగోళ్లను చేపడుతున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడడం లేదు.



ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యం

వినియోగంలోకి తేవాలి

సబ్‌మార్కెట్ యార్డును వినియోగంలోకి తేవాలని రైతులు డిమాండ్‌చేస్తున్నారు. కేవలం సీజన్‌లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి అనంతరం మూసివేయడంతో రైతులు తమ ఇతర పంట ఉత్పత్తులను విక్రయించుకోవడానికి గాను దూరప్రాంతాల్లోని మార్కెట్‌లకు వెళ్లడానికి అనేక వ్యయప్రయాసాలకోర్చాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి మార్కెట్‌లో శాశ్వత కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోడెం మల్లేశం

నర్సంపేట, ఏప్రిల్ 10 : కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పాలని ఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కార్మికులకు పిలుపు నిచ్చారు. పట్టణంలో బుధవారం హమాలీ కార్మికుల సమావేశం సంఘం పట్టణ అధ్యక్షుడు మేరుగు జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక సామ్రాజ్యవాదం, బహుళజాతి కంపెనీలకు దాసోహం చేస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చివేసి చట్టం తీసుకువచ్చిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ తీసుకువస్తున్న కార్మికవ్యతిరేక, రైతు వ్యతిరేక చట్టాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని విమర్శించారు. మే 1న జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపు కోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇప్ప బాబన్న, దేవసాని సాంబయ్య, కడారి కుమారస్వామి, నర్సింగం, యాకయ్య, సదానందం, అశోక్, ఐలయ్య, మధు, కుమార్ పాల్గొన్నారు.

ఉగాది బాల కవి సమ్మేళనం



బాల కవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 10 : పట్టణంలోని సంజీవని ఆశ్రమంలో లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా బుధవారం బాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు, ప్రకృతి, సెల్ ఫోన్‌ల ప్రభావంపై విద్యార్థులు తాము రాసిన కవితలను చదివి వినిపించారు. అనంతరం కవి కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి సృజనాత్మక ప్రక్రియ- కవిత్వం అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. కాళోజీ, అలిశెట్టి ప్రభాకర్‌ల కవితలను ఉదాహరణలుగా తెలిపారు. చక్కని కవితలను రాసి వినిపించిన విద్యార్థులు ప్రియాంక, శిరీష, సింధు, భరత్‌కుమార్, పవిత్రలను నిర్వాహకులు శాలువాలతో సత్కరించి, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు డాక్టర్ ఎ.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం



వర్ధన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 10 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ కమిషనర్ ఇ.జోనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలుచేసి మిల్లులకు తరలించాలన్నా రు. ఎండా కాలం సందర్భంగా అందుబాటులో మంచి నీరు ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పీఏసీఎస్ సీఈవో వెంకన్న, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

● నెక్కొండ : పండించిన పంటల విక్రయంలో రైతులు శ్రమ, రవాణ ఖర్చులను నివారించేందుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్, పీఏసీఎస్ సీఈవో మోడం సురేష్ అన్నారు. నెక్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం లో నాణ్యత ప్రమాణాలను పాటించి విక్రయానికి తీసుకువస్తే గిట్టుబాటు ధర పొం దుతారన్నారు. నెక్కొండతో పాటు నాగారం, దీక్షకుంట, పెద్దకొర్పోలు, చిన్నకొర్పోలు లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో వసంత పాల్గొన్నారు.

● ఖానాపురం : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) సీఈవో ఆంజనేయులు అన్నారు. బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఖానాపురం, ఐనపల్లి, కొత్తూరు, మనుబోతులగడ్డ, బండమీదిమామిడితండా, బుధరావుపేట, ధర్మరావుపేట, మంగళవారిపేట, అశోక్‌నగర్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించి, మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడు ధాన్యానికి రూ.2203, సాదారణ రకానికి రూ.2183ల మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాణి, సంధ్య, సంతోష్, రాజ్‌కుమార్, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఈద్ ఉల్ ఫిత్ర్'

(5వ పేజీ తరువాయి)

మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. మానవుడిలో ప్రేమాభిమానాలు, క్రమశిక్షణ, కర్తవ్యపరాయణత్వం, సహనం, దాతృత్వం, పవిత్ర జీవనం, న్యాయమార్గానుసరణం, ఆర్థిక సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం తదితర ఉత్తమ గుణాలు అలవడుతాయని చెబుతారు. ఈ అలవాటు చేసేందుకు దేవుడైన అల్లాహ్ ప్రతీయేడు మానవ జాతికి రంజాన్ మాసాన్ని ప్రసాదించాడని ముస్లింలు భావిస్తారు.

ఆకలి బాధను గుర్తెరిగే రోజా..

రంజాన్ ఉపవాస దీక్షగా వ్యవహరించే 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలువస్తాయి. ఉపవాసిని 'సాయిమ్'అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ఈ ఉపవాస దీక్షల వల్ల నిర్మలమైన, నిశ్చలమైన భక్తిభావం ఏర్పడడమే కాకుండా ఆకలి బాధతో అల్లాడే దీనజనుల కష్టాలను స్వయంగా ఉపవాస దీక్షల ద్వారా గుర్తించే అవకాశం లభిస్తుందని విశ్వసించి నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. ఆ క్రమంలోనే రోజూ ఐదుసార్లు దైవారాధన (నమాజ్) చేశారు. రాత్రి వేళల్లో తరావి నమాజ్‌లు చేశారు. అంతేకాకుండాపవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకుని గురువారం (నేడు) రంజాన్ పండుగ జరుపుకుంటున్నారు.

108 వాహనాల తనిఖీ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 10 : వర్ధన్నపేటలోని అత్యవసర అంబులెన్సు 108 వాహనాలను బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాము తనిఖీచేశారు. ఈ సందర్భంగా అంబులెన్సులో ఉన్న మందులను, పరికరాలను పరిశీలించి రికార్డుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎల్లప్పుడు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండడంతో వడదెబ్బను దృష్టిలో పెట్టుకుని తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాము, నాగరాజు, రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వేగం పెంచాలి

దుగ్గొండి, ఏప్రిల్ 10 : గ్రామాల్లో ఎక్కువ సంఖ్య కూలీలతో జాతీయ ఉపాధిహామీ పనుల వేగంపెంచాలని ఎంపీడీవో అరుంధతి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పనులపై నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసు కుంటామన్నారు. గుర్తించిన పనులను త్వరతగతిన చేపట్టాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నిబంధనలు పాటించి పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీనివాస్, ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 10 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మల్లీశ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని ఇల్లందలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే దంపతులు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, నాయకులు కమలాకర్ రావు, సిలువేరు శ్రీధర్, ఐత యాకాంతం, ఐత సుధాకర్, జన్ను భిక్షపతి, అన్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు సర్దార్ పాపన్న పేరును ప్రకటించాలి



నూతన కార్యవర్గాన్ని ఆహ్వానిస్తున్న రమేష్‌గౌడ్

చెన్నారావుపేట, ఏప్రిల్ 10 : జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ పేరును ప్రభుత్వం ప్రకటించాలని మోకుదెబ్బ స్టేట్‌వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం లో మోకు దెబ్బ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన వాగ్దానాలు నాలుగు గడిచినా అమలు చేయడంలేదన్నారు. తాటి చెట్లపై నుంచి పడిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం సర్దార్ పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. అనంతరం నర్సంపేట డివిజన్ మోకు దెబ్బ కన్వీనర్‌గా గోడిశాల మల్లయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, రాష్ట్ర నాయకులు సోల్తీ సారయ్యగౌడ్, మద్దెల సాంబయ్య, జూలూరి హరిప్రసాద్‌గౌడ్, పంజాల వెంకట్, బుడిగే మల్లేషం, మండ కుమారస్వామి, సాంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి




రేగులకుంటలో మట్టిని తవ్వుతున్న కూలీలు

ఖానాపురం, ఏప్రిల్ 10 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండాలని ధర్మరావుపేటకు చెందిన రైతులు కొంరయ్య, రాములు, ఐలయ్యలు బుధవారం తెలిపారు. గ్రామంలోని కొమ్మరి కుంట, రేగులకుంటలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో భాగంగా చెరువులోని మొరం మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించి ఇండ్లలో లేవలింగ్ కోసం వినియోగిస్తున్నారని అన్నారు. చెరువుల్లో సారవంతమైన పూటిక మట్టిని తవ్వితే రైతులు తమ పొలాల్లో పోసుకొని భూసారం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రతి ఏటా మొరం మట్టికోసం కుంటల్లో, చెరువుల్లో తవ్వకాలు జరిపితే కుంటల్లో లోతైన గుంతలు ఏర్పడుతున్నాయని అన్నారు. అదేవిధంగా తూముల కంటే చెరువులు లోతుగా మారడంతో చెరువుల్లో నీటిమట్టం తగ్గిన సమయంలో తూములకు నీరందక సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ చేపట్టి రైతులకు ప్రయోజనకరంగా ఉండే పనులు చేపడితే రైతులతో పాటు ఉపాధి కూలీలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

నల్లబెల్లి, ఏప్రిల్ 10: మండలంలోని రుద్రగూడెం గ్రామంలో ఇటీవల ఓ రైతు వ్యవసాయ పనిముట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో బాధిత రైతు గాదె మహేందర్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో బుధవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడి వివరాలు సేకరించారు. త్వరలోనే బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలను తీసుకుంటామని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికే అమ్మ ఆదర్శ కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న కొర్ర సారయ్య

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటుచేసి, ఆ కమిటీలతో అభివృద్ధి పనులు చేయిస్తామని మండల నోడల్ అధికారి కొర్ర సారయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అమ్మ ఆదర్శ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు మంజూరైన పనులకు తీర్మానం చేసి, నాణ్యతగా పనులు జరిగే విధంగా చూడాలన్నారు. కనీస అవసరాలను గుర్తించి, వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్, నీటి వసతి, మరుగుదొడ్ల మరమ్మతులు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో రత్నమాల, ఏపీఎం మహేందర్, డీపీఎం సరిత, మహిళా సంఘాల అధ్యక్షులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4 ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు ఇచ్చే శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కులం, ఆదాయం, నివాసం, డిగ్రీ సర్టిఫికెట్స్‌తో హనుమకొండ ఇందిరానగర్‌లోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ సమీపంలోని కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9346374583, 6302885783, 9908155090 సెల్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

పడకేసిన పారిశుధ్యం



కుండీ నిండి రోడ్డుపైకి వస్తున్న చెత్త

ఖానాపురం, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం నెలకొంది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.గ్రామస్థులు ఉపయోగించిన చెత్తాచెదారం జీపీ సిబ్బంది తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఇండ్ల ముందు ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో చెత్తాచెదారం నిండి రోడ్లపైకి వస్తుండటంతో రాకపోకలు సాగించే గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నా రు. గ్రామంలో నిత్యం జీపీ ట్రాక్టర్‌లో జీపీ సిబ్బంది చెత్తకుండీల్లో ఉన్న చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. గత 20రోజుల నుంచి చెత్తను తొలిగించక పోవడంతో చెత్తకుండీల్లో, రోడ్లపై చెత్తాచెదారం పేరుకు పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సుప్రజను వివరణ కోరగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రిపేర్‌లో ఉన్నందున రిపేర్ కోసం షోరూంకు పంపామని, ట్రాక్టర్ రిపేర్ పూర్తికాగానే చెత్త సేకరణ చేపడుతామని, గ్రామస్థులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఇఫ్తార్ విందు


చెన్నారావుపేట, ఏప్రిల్ 10 : మండలంలోని పాతమగ్దుంపురం మసీదులో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ననుమాస వీరాస్వామి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలెపెల్లి భిక్షపతి ననుమాస కర్ణాకర్, శంకేశి రంజిత్, కుమార్, పటాన్, షేక్ యాకుబ్, హుస్సేన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

మట్టెవాడ, ఏప్రిల్ 10: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఓ వ్యక్తికి మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి బుధవారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. వరంగల్ ట్రాఫిక్ పరిధిలో కాశిబుగ్గ వద్ద వరంగల్‌కు చెందిన గుగులోత్ సురేందర్ మద్యంతాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ వీరస్వామి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. కాగా, సురేందర్‌ను మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఎండుతున్న పంట పొలాలు

● **పశువులను మేపుతున్న వైనం**



ఎండిన పొలంలో పశువులను మేపుతున్న కాపరి

చెన్నారావుపేట, ఏప్రిల్ 10 : మండలం కేంద్రంలోని కోపాకుల చెరువు ఆయకట్టు కింద ఉన్న చివరి ఆయకట్టుకు గత కొద్ది రోజులుగా సాగునీందక పోవటంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ యాసంగిలో అధికారులు నిర్ణయించిన ఎకరాల్లో వరి పంటలను సాగుచేశారు. ఎండల తీవ్రతతో చెరువులోని సాగునీటి మట్టం తగ్గిపోయింది. చివరి ఆయకట్టుకు రైతులు సాగునీరందడంలేదు. చెన్నారావుపేటకు చెందిన గుంటి భిక్షపతి 30గుంటల పొలంలో బుధవారం గొర్రెలు పశువులను మేపాడు. ఆయకట్టులో ఎండిన పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి తగిన నష్ట పరిహారాన్ని అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.